విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 23 సెప్టెంబరు 2024 8 పేజీలు

అక్రమ మద్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండి

- తీరంలో జోరుగా అక్రమ మద్యం అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

"ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం విధానం అమలు చేయడానికి తల మునకలై ఉండగా ఇదే అదనుగా భావించి అక్రమ మద్యం వ్యాపారులు విజృంభిస్తున్నారు. వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఎక్సైజ్, పోలీస్ అధికారులు సైతం చేతులెత్తేయడంతో అక్రమ వ్యాపారులు గేట్లు ఎత్తారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది...."

– కాట్రేనికోన, విశాలాంధ్ర

మన రాష్ట్రానికి పక్కనే ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో చౌకగా లభిస్తున్న మద్యంను అక్రమంగా రాష్ట్రానికి తరలించి వ్యాపారం చేయడంతో రాష్ట్ర ఆదాయానికి గండిపడుతోంది. రోజూ యానాం నుండి జరుగుతున్న అక్రమ మద్యం రవాణాతో కోట్ల రూపాయల్లోనే రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం కలుగుతున్నట్లు తెలిసింది. ఈ మధ్యకాలంలో ఈ అక్రమ మద్యం రవాణాపై నిఘా కొరవడింది. ఆంధ్ర సరిహద్దులోని ఎదురులంకలో చెక్ పోస్టును ఎత్తివేశారు. రోడ్డు పక్కనే పోలీస్ స్టేషన్‌లో ఉన్నా పట్టించుకోరు. దీంతో అక్రమ మద్యం రవాణా దారులకు అడ్డు అదుపు లేకుండా పోయిందనే చెప్పాలి. యానాం నుంచి రోజూ పట్టపగలే అక్రమ మద్యం మోటార్ సైకిళ్ళు, ఇతర వాహనాలపై ఆంధ్రాలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, అమలాపురం తదితర ప్రాంతాలకు నిరాటంకంగా రవాణా అయిపోతోంది. కోట్లాది రూపాయలు ఆదాయానికి గండిపడుతున్నా ఆంధ్ర అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వెలివెత్తుతున్నాయి. అక్రమ మద్యం రవాణాను అడ్డుకునే వారే కరువయ్యారు. ఇది అక్రమార్కులకు వరంగా మారింది. ప్రధానంగా కాట్రేనికోన మండలంలోని తీర గ్రామాలకు రోడ్డు మార్గం, గోదావరి పాయల గుండా బోట్లు ద్వారా పెద్ద ఎత్తున యానాం మద్యం దిగుమతి అవుతోంది. బలుసుతిప్ప కేంద్రంగా ఇతర గ్రామాలకు రవాణా వ్యాపారం

▶మిగతా 2లో..

ఇళ్లు దెబ్బతిన్న బాధితుల జాబితా ప్రదర్శన : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: జిల్లాలో భారీవర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలలో నష్ట గణన ప్రక్రియ నిర్వహించగా అందులో 207 ఇళ్లకు సంబంధించి దెబ్బతిన్నట్లు సమాచారాన్ని నమోదు చేసారని, సదరు జాబితాను కలెక్టరేట్‌లో ప్రదర్శించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. వరద నష్టాలను యాప్‌లో నమోదుపై సంబంధిత అధికారులతో ఆదివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారీవర్షాలు, వరదల మూలంగా నష్టపోయిన ప్రాంతాలలో ఏ ఒక్క బాధితుడికి సహాయం అందలేదని చెప్పేందుకు వీలులేకుండా రీ వెరిఫికేషన్ చేయాలనీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే బాధితులు తక్షణమే సంబంధిత తహసీల్దార్, ఆర్డీవోల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీవర్షాలు, వరదల కారణంగా ఇళ్ళు నష్టపోయిన బాధితులకు ఈ నెల 25న పరిహారం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ఎన్యూమరేషన్ చేసిన జాబితాను ఆయా గ్రామ సచివాలయాలు, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో ప్రదర్శించిన జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలు తెలియజేసే వారి వివరాలను పునః పరిశీలించి సంబంధిత యాప్‌లో సోమవారం నాటికి ఆధారాలతో సహా అప్లోడ్ చేయాలన్నారు. నష్టపోయిన ఏ ఒక్కరూ ఎన్యూమరేషన్ కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం

▶మిగతా 2లో..

ఇది ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – తాడేపల్లిగూడెం : అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం" అని ప్రజల చేత అనిపించుకున్న కూటమి ప్రభుత్వమని, సంక్షోభంలోనూ సంక్షేమం అందించడం చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ కే సాధ్యం అని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం " కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక 12వ వార్డు చిన్న బలుసులమ్మ వారి ఆలయం వద్ద సమావేశం జరిగింది. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వంద రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల యొక్క సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. "ఇది మంచి ప్రభుత్వం, మంచి మనసున్న ప్రభుత్వం" అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే

▶మిగతా 2లో..

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో

ప్రమాదం

- పాఠశాల వద్ద విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్
- ఒకే చోట ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ప్రైవేట్ పాఠశాల
- కాసులకు కక్కుర్తి పడి అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

విశాలాంధ్ర – గణపవరం: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో అప్పటిలో విద్యుత్ శాఖలో ఉన్న అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఒక ప్రైవేటు వ్యక్తికి త్రీఫేస్ కరెంటు లైన్లు వేశారు. దానికి ట్రాన్సుఫార్మర్ ఏర్పాటు చేయాలి విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో ఆ ట్రాన్స్ ఫార్మరను మండల కేంద్రమైన గణపవరం గ్రామం బాలయ్య చెరువు రామాలయం వీధి 10వ వార్డు ప్రభుత్వ ఎంపీపీ ప్రాథమిక పాఠశాల గుమ్మం ముందు చిన్నపిల్లలకు అందుబాటులో ప్రమాదపు అంచున కరెంట్ ట్రాన్స్ ఫారం స్కూలు వద్ద ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ పాఠశాల కాకుండా అదే భవనంలో అంగనవాడి సెంటర్ కూడా ఉంది దాని ప్రక్కనే

▶మిగతా 2లో..

జాబితా ప్రదర్శన

(1వ పేజీ తరువాయి)

కల్పించిందన్నారు. బ్యాంకు ఖాతా నెంబర్ సమోదు ఏమైనా వ్యత్యాసం ఉంటే వాటిని పరిశీలించి సరిచేయించాలన్నారు. స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను జిల్లాలో మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రతీ కార్యాలయంలోనూ సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంబంధిత కార్యాచరణ ప్రకారం కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 సంబంధించి మండల స్థాయిలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇందుకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ తో విడుదల చేసిన పోస్టర్లను ప్రతీ గ్రామ/వార్డ్ సచివాలయాలు,ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం

(1వ పేజీ తరువాయి)

అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అనేక సంస్కరణలు చేపట్టి ఇది మంచి మనసున్న ప్రభుత్వం అని నిరూపించబడిందని అన్నారు. అలాగే తాడేపల్లిగూడెం పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులువలవల బాబ్జి, పాలూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీ వర్తనపల్లి కాశీ, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, దాట్ల జగన్నాథం, జనసేన నాయకులు గుండుమోగుల సురేష్, నల్లగంచు రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ రవి,మరియు నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదం (1వ పేజీ తరువాయి)

ఒక ప్రైవేటు పాఠశాల కూడా ఉంది. ఈ మూడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు చిన్న పిల్లలు ఎక్కువగా ఉన్నారు. అలాగే నిత్యం ఆ రోడ్డుపై వాహనాలు తిరుగుతూ ఉంటాయి గతంలో ఆ స్కూలు ప్రధానోపాధ్యాయులు ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణి వ్యవహరించారని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆదివారం విశాలాంధ్ర దృష్టికి తీసుకువచ్చారు. స్కూల్లో చదివే పసిపిల్లలు తిరిగే ప్రాంగణంలో చేతికి అందుబాటులో ఉన్నటువంటి ఈ ట్రాన్స్ ఫార్మర్ను వెంటనే తొలగించి వేరే చోటకు మార్చాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. లేనిపక్షంలో విద్యార్థులకు ఏమైనా జరిగితే భారీ మూల్యం విద్యుత్ శాఖ చెల్లించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు.

ఘనంగా గురజాడ జయంతి

విశాలాంధ్ర ఏలూరు: ప్రముఖ తెలుగు రచయిత గురజాడ అప్పారావు గొప్ప సంఘసంస్కర్త, సాహితీకారుడు, హేతువాది, అభ్యుదయ కవి అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యు) ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని కొనియాడారు. ఏలూరులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో వరక శ్యామల, మన్నవ యామిని మాట్లాడుతూ గురజాడ తన కవిత, రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరన్నారు. హేతువాది 19వ శతాబ్దంలో 20వ శతాబ్ది మొదటి దశకంలో అతడు చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్నలను పొందుతున్నాయని తెలిపారు. అతను ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారన్నారు. దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అంటూ తెలుగు వారు గర్వించదగిన గొప్ప దేశభక్తి గేయం రచించారని కొనియాడారు. నేటి విద్యార్థులందరూ నిరంతరం చెప్పగలిగేలా ఆ గేయాన్ని నేర్చుకోవాలని సూచించారు. ప్రపంచంలో ఏ దేశమైనా తమ భాషలోకి మార్చుకొని జాతీయగీతంగా పెట్టుకోగలిగిన అర్హత గురజాడ రాసిన దేశమును ప్రేమించుమన్నా గేయానికి ఉందని మహాకవి శ్రీశ్రీ ఏనాడో తెలిపారన్నారు. ప్రతి విద్యార్థి దేశమును ప్రేమించుమన్నా గేయం పాడగలిగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. సంఘ సంస్కరణకు సాహిత్య సంస్కరణకు గురజాడ తన రచనల ద్వారా అడుగుజాడలు ఏర్పరిచారని పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ద్వారా నిధులు అందజేసి పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని , ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ గంట పద్మశ్రీ ప్రసాద్ లను తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొరగం శ్రీనివాసరావు, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు కోరారు. ఆదివారం బయ్యనగూడెం గ్రామంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్ ఇంటి వద్దకు విచ్చేసిన , గంట పద్మశ్రీ ప్రసాద్ లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొరగ%శీ% .శ్రీనివాసరావు, పారేపల్లి రామారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ద్వారా, నిధులు అందజేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేలా ఉండాలని, పోలవరం నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలలో సిసి రహదారులు, డ్రైనేజీలు, రైతులు వారి యొక్క పొలాలకు వెళ్లే విధంగా రహదారులు ఏర్పాటు చేయాలని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ ను కోరారు. ఈ కార్యక్రమంలో శుక్ల బోయిన. శ్రీనివాస్, ఆనం. సాయి, తోంట .దుర్గాప్రసాద్, గొర్రెపాటి .మహేష్, పెనుబోయిన. బాలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ : కలెక్టర్

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లా కలెక్టరు వారి కార్యాలయములో గోదావరి సమావేశ మందిరం నందు, జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మునిసిపల్ కార్యాలయములలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమము నేడు సోమవారము ఉదయం గం. 10ని.ల నుండి యధావిధిగా నిర్వహించబడుతుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నీతి, నిజాయితీకి మారుపేరు : వెంకట్రామయ్య

విశాలాంధ్ర -భీమవరం: నీతికి నిజాయితీకి మారుపేరుగా నాచు వెంకట్రామయ్య ఆరు దశాబ్దాలు ప్రజా సేవలో జీవితం గడిపారని పలువురు వక్తలు నివాళు లు అర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నాచు వెంకట్రామయ్య 110వ జయంతి కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుమారులు నాచు మురళీ మాట్లాడుతూ వెంకట్రామయ్య కుమారులుగా ఎంతో గర్విస్తున్నామని అన్నారు. కుటుంబ సభ్యులు మాజీ కౌన్సిలర్ సుంకర బాబూరావు, సుంకర మంగతాయారు, నాచు శ్రీవల్లి, కాశీ శేఖర్, నల్లం లోకనాథం, వివిఆర్ హనుమంత్ రావులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో నాచు వెంకట్రామయ్య విగ్రహం వద్ద సుందర వనం నిర్మాణానికి నిధులు అందచేస్తామన్నారు.శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ విగ్రహం వద్ద పార్క్ నిర్మాణం జరిగిందని, కానీ అసంపూర్తిగా ఉందని, సంపూర్ణంగా అభివృద్ధి చేయడానికి వారి కుమారులు మురళీ ని కోరగా వెంటనే స్పందించి సహకరిస్తామని తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, TAMANAMPUDI GANGA SRI RAMA REDDY (New Name), S/O NAGA VENKATA SATYANARAYANA REDDY, Previously Called TAMANAMPUDI GANGA SREERAMA REDDY (Old Name), Resident of D.No:3-202/3, Nattarameswaram Village, Penumantra Mandal, W.G.Dt., A/P-534124. I have changed my name from TAMANAMPUDI GANGA SREERAMA REDDY (Old Name) To **TAMANAMPUDI GANGA SRI RAMA REDDY** (New Name) for all practical purposes.

CHANGE OF NAME

I, MUKKU SRAVANI KUMARI (New Name), W/O NAGA SATISH, Previously Called MUKKU SRAVANI (Old Name), Resident of D.No:4-105, Pedda Street, Kopparru Village, Narasapuram Mandal, W.G.Dt., A/P-534275. I have changed my name from MUKKU SRAVANI (Old Name) **To MUKKU SRAVANI KUMARI** (New Name) for all practical purposes.

ఆదాయానికి గండి

(1వ పేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారు. ఎక్కడా దొరకని ఖరీదైన అన్ని రకాల మద్యం బ్రాండ్లు తీరగ్రామాల్లో లభ్యమవుతున్నాయి. వచ్చే అక్టోబర్ నెల నుంచి కొత్త మద్యం విధానం వస్తుండడంతో తీర గ్రామాల్లో రెండు మూడు నెలల కాలానికి మద్యంవ్యాపార నిర్వహణకు తాత్కాలిక వేలంపాటలు నిర్వహించారు. బలుసుతిప్ప,పల్లం, మొల్లేటిమోగ, కొత్తపాలెం, పొర, చిర్రయానం తదితర గ్రామాల్లో లక్షల్లో వేలం పాటలు పాడుకుని అక్రమ మద్యం వ్యాపారాలు చేస్తూ లక్షలు అర్జిస్తున్నారు. యానాం నుంచి తక్కువ రేటుకు నాసిరకం మద్యం తెచ్చి ఇక్కడ విక్రయిస్తుండడంతో అక్రమంగా అధిక లాభాలు కాజేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిరక్షరాశులయిన మత్స్యకారులు తీర గ్రామాల్లో నాసి రకం మద్యం తాగి అనేకమంది రోగాలు పాలై మంచం పడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే చాలామంది చనిపోయారని స్థానికులు చెబుతున్నారు. ఇంతా జరుగుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని, ఒకటి అర కేసులు పెట్టడం తప్ప శాశ్వతంగా అక్రమ మద్యం వ్యాపారాన్ని నిరోధించడం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మండలంలో అత్యధికంగా మత్స్యకారుల జనాభా ఉన్న బలుసుతిప్ప, పల్లం గ్రామాల్లో ప్రత్యేకంగా ప్రభుత్వ బ్రాందీ షాపులు పెట్టే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు ఆలోచించడం లేదు. షాపులు నిర్వాహనకు ఆదాయం సరిపోదంటూ ఇక్కడ షాపులు ఇవ్వడానికి ఎక్సైజ్ అధికారులు అడ్డు పుల్ల వేస్తూ అనుమతి ఇవ్వడం లేదు. ఒక విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధుల వైఖరి వల్లే అక్రమ మద్యం వ్యాపారాలు అడ్డు అదుపు లేకుండా సాగుతున్నాయేమో అనిపిస్తోంది. గతంలో ఇక్కడ షాపులు పెట్టడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లినా రాజకీయ లబ్ధి కోసం ప్రజా ప్రతినిధులే అడ్డుపడినట్లు తెలిసింది. ప్రభుత్వ లేదా ప్రైవేటు బ్రాందీ షాపులు ఉన్నా తీర గ్రామాలలో వేలం పాటలు తీరు మారదు. ప్రభుత్వాలు మారినా ఆయా పార్టీకి చెందిన నిర్వాహకులు మారడం తప్ప స్థానికంగా షరా మామూలే. అనాదిగా తీర గ్రామాల్లో ప్రాణాలను పణంగా పెట్టి మద్యం షాపులు వేలం పెట్టడం ద్వారా వచ్చే లక్షలాది రూపాయలను స్థానికంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు కనీసం ఒక్క రూపాయి కూడా వెచ్చించరు అంటే అతిశయోక్తి కాదు. మండలంలో మద్యం షాపులకు లక్షలాది రూపాయలు డిపాజిట్లుగా కట్టి టెండర్లు వేయడానికి కూడా టెండర్ దారులు అక్రమ మద్యం వ్యాపారాల భయంతో ముందుకు రాలేకపోతున్నట్లు తెలిసింది. మత్స్యకార గ్రామాల్లో రూ.10 లక్షల నుండి 20 లక్షల వరకు, పెద్ద గ్రామాల్లో 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఏడాది పాటు బెల్ట్ షాపులు నిర్వహించుకునేందుకు వేలం పాటలు పెట్టడానికి కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. కొత్త మద్యం విధానంలోనైనా తీరంలోని పెద్ద గ్రామాల్లో ప్రభుత్వ మద్యం షాపులు నెలకొల్పి, యానాం అక్ర మద్యం వ్యాపారాలను అరికట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, అలాగే ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని సర్వత్రా కోరుతున్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలని పశ్చాత్తాప పాదయాత్ర

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: తిరుమల పవిత్రతను కాపాడాలని బుట్టాయిగూడెంలోని హిందువులు ఆదివారం పశ్చాత్తాప పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఆర్టికల్ 26ను అమలు చేయాలని, గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల పవిత్రతను పాడుచేసిన వారిని శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు కె రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షులు మెట్టా బుచ్చిరాజు, టిడిపి నాయకులు నల్లూరి కృష్ణమోహన్, మాటూరి ముసలయ్య ,గరికపాటి రవీంద్ర ,గంగాభవాని పాల్గొన్నారు.

వరల్డ్ ఫుడ్ ఇండియాకు కొయ్యలగూడెం మండలం ఎంపిక

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రపంచ దేశాలన్నీ కలిసి నిర్వహిస్తున్న ప్రపంచ ఆహార కార్యక్రమంలో కొయ్యలగూడెం మండలానికి చోటు దక్కింది. వరల్డ్ ఫుడ్ ఇండియా నిర్వహణకు 2024 సంవత్సరం భారత దేశం వేదికగా నిలిచింది. సెప్టెంబర్ 19 నుంచి 22వ వరకు ఢిల్లీలో ఈ కార్యక్రమం వరల్డ్ ఫుడ్ ఇండియా పేరుతో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో తమ ఆహార ఉత్పత్తులు ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 10 జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆ 10 జిల్లాల్లో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం ఉన్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. వెట్రి సెల్వి శనివారం తెలిపారు. ఈ వరల్డ్ ఫుడ్ ఇండియాకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామంలో తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తులు ఎంపికైనట్లు ఆమె వివరించారు. ఆ గ్రామంలోని మథర్ థెరిసా మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు తోట కృపామణి తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తులు ఎంపికయ్యాయి. ఈ ఉత్పత్తుల ప్రదర్శనను తొలి రోజు కేంద్ర ఆహార శుద్ధి శాఖా మాత్యులు శ్రీ చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించగా రెండో రోజు ఆంధ్రప్రదేశ్ ఆహార శుద్ధి శాఖా మాత్యులు శ్రీ టి.భరత్ రాష్ట్ర స్టాల్స్ తిలకించి అభినందించినట్లు కృపామణి తెలిపారు. కనకాద్రిపురం ఉత్పత్తులు దేశ రాజధానిలో ఇతర దేశాలతో పాటు ప్రదర్శించారు. ఇతర దేశాల కార్పొరేట్ కంపెనీలతో పాటు మా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు అక్కడ ప్రదర్శించటం గర్వంగా ఉందన్నారు. ఇప్పటికే తాము తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కోసం ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ప్లాట్ ఫారంలో ఆన్ లైన్ సదుపాయాన్ని జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ కల్పించామన్నారు. మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగు పరచటానికి జిల్లా అధికారులు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎక్కువ మంది మహిళలకు రుణ సదుపాయం కోసం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా, స్త్రీ నిధి డైరెక్టర్ గా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తనకు ఇంతటి అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి కే. వెట్రి సెల్వి కి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు, జీవనోపాదుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనిత, గ్రూపులు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విజయ కుమారిని వెలుగు ఏపీఎం,సి.సి లకు ధన్యవాదాలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-కుక్కునూరు: మండలంలోని శ్రీధర గ్రామంలో భద్రాచలం పట్టణం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.క్లబ్ ఉపాధ్యక్షులు షేక్.అజీమ్ అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.పలు గ్రామాల నుంచి తరలివచ్చిన సుమారు 400 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం లో భద్రాచల పట్టణ ప్రముఖ వైద్యులు సోమయ్య, రామకృష్ణ, శివరామకృష్ణ, అజిత్ రెడ్డి,హేమంత్, భరణిబాబు, సంతోష్, నరసింహారెడ్డి,లోకేష్,పవన్ రెడ్డి,కోటిరెడ్డి,రాహుల్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై బాలికలకు అవగాహన

విశాలాంధ్ర-టి నరసాపురం: బాలికలు ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐఎం జయబాబు తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం ఆశ్రమ గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్లో బాలికలకు పోక్సో చట్టం ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని సూచించారు. బాలికలు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన తెలిపారు. ఏ సమస్యలు ఎదురైనా అధైర్య పడకుండా పోలీసులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ ఐ వి జయకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పితాని కలిసిన ది పెనుగొండ ఐరన్ అసోసియేషన్ సంఘ సభ్యులు

విశాలాంధ్ర-పెనుగొండ: పెనుగొండ ది ఐరన్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు కుడిపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ది పెనుగొండ ఐరన్ అసోసియేషన్ సంఘ సభ్యులు ఆదివారం ఆచంట శాసనసభ్యుల పితాని సత్యనారాయణని కొమ్ముచిక్కాల ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అసోసియేషన్ సంఘానికి కావలసిన సహాయ సహకారాలు అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తదనం తరం లింగాల వీధిలోగల త్యాగరాజ కళ్యాణమం డపంలో నిర్వహించిన సర్వ సభ్యుల సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో కార్యవర్గ గౌరవ అధ్యక్షుడు నందం వెంకటకృష్ణారావు ఉపాధ్యక్షుడు నౌడు దుర్గారావు, కార్యదర్శి దొడ్డిపట్ల రాంబాబు, సమతం సత్యనారాయణ, దొడ్డిపట్ల శివ,సిరికి శ్రీనువాసు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణమరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి : కోటేశ్వరరావు

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్లో మాల యోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాలయోధుల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యులు చేపత్తిన కోటేశ్వరరావు (మున్నా) మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో అందరి ప్రశంసలు పొందిన భారత రాజ్యాంగాన్ని రచించి, బడుకు బలహీన వర్గాల జీవితాలలో వెలుగులు నింపిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్పై శాసనసభ్యులు రఘురామ కృష్ణమరాజు వ్యవహరించిన తీరు, చర్యలను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్తో ఉన్న ఫ్లెక్సీ బ్యానర్ను చించి వేయడమే కాక, అతని అనుచరులు ఈలలు వేసి చప్పట్లు చరుస్తూ గోల చేయడం దారుణమైన చర్యగా పేర్కొన్నారు. ఇలాంటి చర్యలలో రఘురామకృష్ణమరాజు అహంకార స్వభావం బహిర్గతం అయ్యిందన్నారు. తక్షణమే రఘురామకృష్ణమరాజు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర గవర్నర్ ను కలసి వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. రఘురామకృష్ణమరాజు తన అహంకార పూరిత చర్య పట్ల సిగ్గుపడుతూ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే, వారి నివాసాన్ని ముట్టడించి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం నూజివీడు పట్టణ పోలీసు స్టేషన్ లో రఘురామకృష్ణమరాజు పై చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాల యోధుల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యులు రుద్రపాటి ప్రసాద్, నత్త నాగేశ్వరరావు, పిల్లా చరణ్, బుర్రి సుధాకర్, తులిమిల్లి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-కాళ్ళ : ఫ్లెక్సీ వివాదంలో దళితుల మనోభావాలను దెబ్బతినే విధంగా మాట్లాడిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు వెంటనే క్షమాపణ చెప్పాలని, ప్రభుత్వ నుండి ఆయనను తొలగించాలని మాజీ పార్లమెంట్ సభ్యులు హర్ష కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలో ఉంది, ,ఉండి ఎంఎల్ఏ అయ్యాను అనే అహంకారము తో మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఏలూరుపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారిన సంఘటన స్థలాన్నిఅమలాపురం మాజీ ఎంపి జివి హర్ష కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎంపీ కను మూరు బాపిరాజు నిర్మించారని గుర్తు చేశారు. గుడి పక్కన అంబేద్కర్ విగ్రహం, ఆ పక్కనే నాగేంద్ర స్వామి విగ్రహం గతంలో ఏర్పాటు చేసినవన్నారు. ఒక కులాన్ని టార్గెట్ చేస్తూ ఎమ్మెల్యే మాట్లాడటం సరైనది కాదన్నారు. ఈ సంఘటన పై పోలీసులు వెంటనే స్పందించి ఎమ్మెల్యేపై సిఎస్సీ ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళిత నాయకులైన చీకటిమిల్లి మంగరాజు, నల్లి రాజేష్ లు మాట్లాడుతూ బాధ్యతగల ఒక శాసనసభ్యులు ఇలా మాట్లాడడం ప్రవర్తించడం చాలా బాధాకరమని దీన్ని దళితులందరం ఖండిస్తున్నామన్నారు.

స్మశాన వాటిక ఆధునికరిస్తాం...

విశాలాంధ్ర - పెనుగొండ: పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన స్మశాన వాటికకు త్వరలో ఆధునికరిస్తామని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి స్మశాన వాటికను పూర్తిస్థాయిలో పరిశీలించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్మశానవాటిక అభివృద్ధిలోభాగస్వామ్యులు కావాలని అప్పుడే మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేవాదాయ శాఖ, స్మశాన వాటికకు సంబంధించిన స్థలం ఎంత మేరకు ఉన్నది, ఇరు శాఖల అధికారులు సమావేశం నిర్వహించుకుని సరిహద్దులు వెంటనే తేల్చుకోవాలని సూచించారు. మరో 10 రోజుల్లో మరల అందరితో సమావేశం నిర్వహించి ఒక కమిటీని ఏర్పాటు చేసి త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం దేవాదాయ శాఖకు సంబంధించి 1.32 ఎకరాలు,స్మశాన వాటికకు సంబంధించి 1.16 ఎకరాలు ఉన్నదని అధికారులుశాసన సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం అవి హద్దులు తేల్చి రికార్డు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆచంట జడ్పిటిసి సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, పెనుగొండ మండల తెదేపా అధ్యక్షుడు వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, సిద్ధాంతం గ్రామ సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), ఉండపల్లి సత్యనారాయణ (చిన్ని), తాసిల్దార్. అనిత కుమారి, ఎంపీడీవో ఎస్. శ్రీనివాస్ దొర, వివిధ శాఖల అధికారులు తెదేపా, జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర -నూజివీడు : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నూజివీడు పోలీసులు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలతో ఆదివారం నాడు నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల వెంకటాద్రిపురంలోని నూజివీడు పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులకు సైబర్ నేరాలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ద్వారా నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ, నూజివీడు రూరల్ ఎస్సై లక్ష్మణ్ బాబు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు సైబర్ నేరగాళ్లు ఏ విధంగా టెక్నిక్లను ఉపయోగిస్తారని విషయాలపైన నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపా దించాలని యువతను చెడు మార్గానికి అనుసరించేలాగా ఆశలు కల్పిస్తూ వివిధ రకాలైనటువంటి యాప్ల ద్వారా గాని లేదా లింకుల ద్వారా గాని డబ్బులను పొదుపు చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని మోసం చేస్తారని పేర్కొన్నారు.బ్యాంకుల అధికారులమని చెప్పి ఫోన్లు ద్వారా ప్రజలకు సంభాషిస్తూ వారి యొక్క ఎకౌంటు నెంబరు పిన్ నెంబర్ లేదా ఓటీపీ తెలియచేయమని చెప్పిన దానిపై ఎవరైనా స్పందిస్తే మీ విలువైనటువంటి సమాచారం, డబ్బులు సైబర్ నేరగాళ్లు తస్కరిస్తారని పేర్కొన్నారు. అమెజాన్, ఫ్లిప్ కార్డ్ ఇతర సంస్థలలో మీకు ప్రైజ్ మనీ వచ్చినట్లు దాని కొరకు ప్రభుత్వానికి టాక్స్ కట్టాలని నమ్మించి మోసపూరితమైన టువంటి మాటలు చెప్పే వారి యొక్క మాటలను నమ్మవద్దన్నారు.

ఇది మంచి ప్రభుత్వం :గన్ని

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిందని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఇది మంచి ప్రభుత్వం అని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరాంజనేయులు అన్నారు. ఆదివారం నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రజలను కలిశారు. ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మహమ్మద్ గఫర్ ఖాన్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముత్యాల వెంకటేశ్వరరావు (స్వామి), మండల బీసీ సెల్ అధ్యక్షులు తాడి శ్రీను, తానుకొండ సూరన్న, పేపేటి శ్యామసుందరం, దిగమర్తి విజయకుమార్, సత్తినీడి నాని, కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసులు లాఠీ చార్జ్ అవాస్తవం : ఎస్పీ

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీను తొలగించిన ఘటనను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు పోలీసు లాఠీచార్జ్ చేశారని సామాజిక మాధ్యమాలలో వైరల్ చేస్తున్న వీడియో అవాస్తవమని జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి , ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇటువంటి అవాస్తవ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఎస్పీ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలను ప్రచారం చేయడం, కుల, ప్రాంత, వర్గ విభేదాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం మరియు వాటిని షేర్ చేయడం చట్టరీత్యా నేరం. కావున ఇటువంటి అవాస్తవాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం మరియు షేర్ చేయడం వంటివి చేయవద్దని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు. ఎవరైనా వ్యక్తులు ఇటువంటి అవాస్తవ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

నా ఎదుగుదల ఓర్వలేకే విమర్శలు : లక్ష్మి

విశాలాంధ్ర - కైకలూరు : కైకలూరు నియోజక వర్గంలో జనసేనా పార్టీ తరపున కృషి చేస్తుంటే నా మీద కొందరు బురద చల్లాలని చూస్తున్నారని నియోజక వర్గ జనసేనా వీరమహిళ తోట లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కైకలూరు నియోజక వర్గ జన సేన పార్టీ కార్యక్రమంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా లక్ష్మి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేస్తున్నామని కొందరు గరికిపాటి రాజ, రామాంజనేయులు, గుర్రం అరవింద్‌లు బురద చల్లుతూన్నారని వాస్తవాలను వక్రీకరించి పార్టీకి నష్టం వాటిల్లే విధంగా చూస్తున్నారని వారిని అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీలో వుండి పార్టీకి నష్టం వచ్చేలా చేస్తున్నారని అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న రని వీరిపై చర్యలు తీసుకోవాలని స్థానిక కూటమి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళతానన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర తణుకు: ఇచ్చిన హామీలు అమలు పరుస్తూ రాష్ట్రంలో సూపరిపాలన అందిస్తున్నామని తణుకు నియోజకవర్గ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తణుకు మండలం దువ్వ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఈ కార్యక్రమంలో దాదాపు 28 మందికి గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని సూపర్ సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దానిలో భాగంగా పెన్షన్ల విషయంలో చెప్పిన మాట నిలబెట్టుకున్నామని తెలిపారు.దీపావళి నాటికి మహిళలకు మూడు సిలిండర్ల పథకం అమలు జరుగుతుందన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను గత ప్రభుత్వం దుర్వినియోగం చేసి అభివృద్ధిని మరచిపోతే...కూటమి ప్రభుత్వం రాగానే రూ. 1452 కోట్లు పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పేదలను దృష్టిలో పెట్టుకుని చెప్పిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లను రీఓపెన్ చేశామని తెలియజేశారు. తణుకు నియోజకవర్గంలో గత అయిదేళ్లలో దోచుకో, దాచుకో అనే విధంగా పరిపాలన సాగించి, అభివృద్ధి ని పూర్తిగా విస్మరించారన్నారు. ప్రత్యేకంగా దువ్వ గ్రామంలో 2014 నుండి 19 వరకు తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధిలో పదో శాతం అభివృద్ధి గత వైసీపీ పాలనలో చేయలేదని అన్నారు. నేడు మళ్ళీ గ్రామాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అన్నీ విధాలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు నమోదు చేయాలి : వైసీపీ

విశాలాంధ్ర-నూజివీడు : నూజివీడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి అభ్యర్థి పూనూరు గౌతమ్ రెడ్డి, ఏలూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూలం నాగేశ్వరావు, నూజివీడు మాజీ శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణ గుంటూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి అభ్యర్థిగా తనను మాజీ ముఖ్య మంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపా దించారని తెలియజేశారు.మన పార్టీ నాయ కులను, కార్యకర్తలను,కలవడానికి అన్ని నియో జకవర్గాలు పర్యటిస్తున్నారన్నారు. నాయకు లందరూ గ్రామాల్లోని పట్టభద్రుల యొక్క ఓట్లు నమోదు చేపించాలని కోరారు. చంద్రబాబు నాయుడు అమలు కానీ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి గెలిచారే తప్ప ప్రజల్లో వాళ్లకు బలం లేదు అని అన్నారు. ఈ వంద రోజులు వారి పరిపాలనలో పెన్షన్లు పెంపు తప్ప చేసింది ఏమీలేదని ఎన్నికల హామీ అయిన సూపర్ సిక్స్ ను గాలికి వదిలేశారని పేర్కొన్నారు.ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ కొందరు నాయకులు మాత్రమే పార్టీ మారుతున్నారు కానీ పార్టీ కార్యకర్తలు ఎక్కడ మారలేదని అన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో 40 పర్సెంట్ ఓట్లు సాధించామని తెలియజేశారు.గ్రామాల్లో నాయకత్వం పటిష్టంగా ఉందని కావున నాయకులందరూ కలిసి పనిచేసి గౌతమ్ రెడ్డి గెలుపు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాలుగు మండలాల నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ సంబరం

విశాలాంధ్ర-ఏలూరు : స్థానిక 47వ డివిజన్ తిలక్ నగర్‌లో శ్రీ గంగానమ్మ, పోతురాజు బాబుల స్నాన సంబర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే బడేటి చంటికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే చంటి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వందనాల దుర్గాభవానీ, ఐ- టిడిపి జిల్లా సెక్రటరీ లవరాజు, కో - ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు వందనాల శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర ఏలూరు : ఏలూరు డివిజన్ పరిధిలో భారీవర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలలో దెబ్బతిన్న ఇళ్లకు, పశు నష్టంకు సంబంధించి బాధితుల జాబితాను ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరిగిందని ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి ఒక ప్రకటనలో తెలిపారు. సదరు జాబితాను బాధితులు పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తక్షణమే సంబంధిత తహసీల్దార్ల దృష్టికి తీసుకురావాలని కోరారు.

భూలోకమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : శ్రీశ్రీశ్రీ భూలోకమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. స్థానిక బావిశెట్టివారి పేటలోని స్వయంభూ శ్రీశ్రీశ్రీ భూలోకమ్మ అమ్మవారి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు ఘటాలను శిరస్సులపై ఉంచుకొని, ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి దంతపలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంకలపల్లి సతీష్, శంకబత్తుల నాగరాజు, మేకల సీతారామయ్య, భావిశెట్టి నందు, గుండు శివాజీ, నిమ్మల శ్రీను, వేంపల అనిల్, కార్పొరేటర్ జున్నూరు కనక నర్సింహారావు, అమరావతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విరాళాల వెల్లువ

విశాలాంధ్ర-తణుకు : విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా అండగా నిలుస్తూ తణుకు పట్టణం వీరభద్రపురం గ్రామంలో ఉన్నటువంటి బెతేల్ అసెంబ్లీ హాల్, జిడిపిఎఫ్ చర్చ్ తరుపున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2,00,000ల విరాళం చెక్కు రూపంలో ఆదివారం తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా విజయవాడకు పెద్ద ఎత్తున వరదలు సంభవించాయని ఇటువంటి విపత్కర పరిస్థితిలో ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టారని ప్రభుత్వంతో పాటు సామాన్య ప్రజలు కూడా ముందుకు వచ్చి వారికి తోచిన విధంగా సహాయం అందించి బాధితులకు అండగా నిలబడ్డారని అన్నారు. వీరభద్రపురం గ్రామంలో ఉన్నటువంటి బెతేల్ అసెంబ్లీ హాల్, జిడిపిఎఫ్ చర్చ్ తరుపున జోసఫ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి పెద్ద ఎత్తున విరాళం అందించడం సంతోషకరం అని అన్నారు. ఇటువంటి విపత్తుల సమయంలో సహృదయంతో విరాళాలు అందించిన దాతలందరికీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు

లడ్డు ప్రసాదం కల్తీపై బహిరంగ విచారణ జరిపించాలి : సీపీఐ

విశాలాంధ్ర- కామవరపుకోట: తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంలో జరిగిన కల్తీపై సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి టీఈఎస్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి తిరుపతి లడ్డూలో వాడటం ద్రోహపూరిత చర్య అని విమర్శించారు. యావత్ ప్రపంచ ప్రజలను ఆవేదన గురిచేసిన ఈ చర్య క్షమించరాని నేరమన్నారు. తిరుమల తిరుపతి భోజనశాలపై గట్టి నిఘా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడిన వారిని అందుకు సహకరించిన వారిని ఏ స్థాయి అధికారులైన సరే విధుల నుండి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. .

అవినీతికోరల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- రిజిస్ట్రేషన్ చేయాలంటే పచ్చనోటు పడాల్సిందే..
- డబ్బులు చేతిలో పెడితే ఏ భూమైన ఒకే..
- రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే హడలిపోతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

విశాలాంధ్ర - సీతానగరం : భూములు క్రయవిక్రయాలు చేయాలన్న, లేక స్థిరాస్తులు కుటుంబ సభ్యులు పేరుతో మార్చుకోవాలన్న ఇలా ఎలాంటి విలువైన ఆస్తులు తమ తమ పేరుతో భద్రం చేసుకోవాలన్న ప్రభుత్వానికి చలానా చెల్లించి రిజిస్ట్రేషన్ కార్యాలయం మెట్లు ఎక్కల్సిందే. అయితే అందుకు భిన్నంగా ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వైపు వెళ్లాలంటేనే మండలంలోని ప్రజలు హడలి పోతున్నారు. ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవి నీతి కంపు కొడుతుందంటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మామూళ్లు చెల్లిస్తేనే ఏ రిజిస్ట్రేషన్ కాగితాలైన అయిన ముందుకు జరుగుతాయి. లేకుంటే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఆ కాగితాలు అక్కడే ఉంటాయని పలువురు వాపోయారు. డబ్బులు ఇస్తే ఏభూమైలైన రిజిస్ట్రేషన్ చేసేస్తారు అనే విమర్శలు గుప్పుమంటున్నాయి.దీనికి సంబం ధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొత్తం ఆరుగురు ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి తోడుగా ఒక ప్రైవేటు వ్యక్తి కీలక వ్యవహారాలన్నీ నడిపిస్తుంటాడు.ఆ ప్రైవేట్ వ్యక్తి ద్వారా ఒక సీనియర్ ఉద్యోగి రిజిస్ట్రేషన్ కార్యాల యానికి వెళ్ళే మార్గంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారినుండి బేరసారాలు సాగిస్తూ లక్షల రూపా యలు వెనకేసు న్నరన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారిలో కొంతమంది ఎదురుతిరిగి మామూళ్లు ఎం దుకు ఇవ్వాలి అని ప్రశ్నిస్తే దానికి మీరు మాకు ఇస్తే మేముపై అధికారులకు ఇచ్చుకోవాలి అంటూ నిసిగ్గుగా సమాధానం చెబుతున్నట్లు పలువురు చెప్పారు. ఏదైనా రిజిస్ట్రేషన్ జరగాలి అంటే రిజిస్ట్రే షన్ చేయించే కొంత శాతం మామూలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది అని లబ్దిదారులు వాపోతు న్నారు. ఈ కార్యాలయంలో కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే ఒకే స్థలం రెండు రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే జరగని అవినీతి లేదు అని చెప్పవచ్చు. స్థలాల్లో పత్రాలు సక్రమంగా లేని వారికి సంబంధించి జిల్లాలో ఎక్కడ చేయని రిజిస్ట్రే షన్లు సైతం ఇక్కడ కాసులు కురిపిస్తే ఆగమేఘా లపై ఏ విధమైన ఇబ్బంది లేకుండా జరుగుతా యని నానుడి బలంగా వినబడుతుంది. ఇవి కాక నాన్ జ్యుడీషియల్ స్టాంప్ లను కార్యాలయంలోనే అమ్మకాలు జరపడానికి సహకరిస్తూ తాము అమ్మా కం జరపాల్సిన స్టాంపులను ప్రయివేటు వ్యక్తితో దగ్గర ఉండి అమ్మిస్తూ ప్రజలకు స్టాంపులను అధిక ధరలకు అమ్ముతున్నారు. ఇవి అని కాక కనీసం జండా వందన నాడు కూడా జెండా ఆవిష్కరణ చేయలేని అధికారి తీరు ప్రజలు ముక్కున వేలేసు కున్నారు. అందువల్లే ఒక సారి ఈ కార్యాలయంలో జరిగే రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే పై అధికారులకు అర్థమౌతుంది. ఇంత జరుగుతున్నప్పటికీ ఉన్నతాధి కారులు పట్టించు కోవడం లేదంటే ఈ అవినీతిలో వారికి భాగస్వామ్యం ఉండవచ్చునీ స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బదిలీ కాకముందే అవినీతి నిరోధక శాఖ, ఉన్నతా ధికారులు, సంయుక్తంగా సీతానగరం సబ్ రిజి స్ట్రార్ కార్యాలయం పై దృష్టి సారించి అవినీతికి పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎంపీ హరీష్ మల్టీ కజిన్ రెస్టారెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం, ముమ్మిడివరం గేట్ వద్ద నూతన మల్టీకజిన్ రెస్టా రెంట్‌ను పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ బాలయోగి ప్రారం భించారు. మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, మాజీ మున్సి పల్ చైర్మన్ చిక్కాల గణేష్, టిడిపి నాయకులు రేవు శ్రీను, ఛాంబర్ అధ్యక్షులు కల్వ కొలను తాతాజీ, కౌన్సిలర్ ఏడిద శ్రీను, రెస్టారెంట్ అధిపతి యలక్కాయల బాబీ తదితరులు పాల్గొన్నారు.

బాల విద్యార్థి గణపతి మండపంలో ఎంపీ హరీష్ పూజలు

అమలాపురం దుడ్డు వారి అగ్రహారంలోని బాల విద్యార్థి గణ పతి మండపానికి అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ బాలయోగి విచ్చేసి గణపతి తీర్థ ప్రసారం స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. బాల విద్యార్థి గణపతి సంఘం కమిటీ సభ్యులు పార్లమెంటు సభ్యులు హరిష్‌కు స్వాగతం పలికారు. హరిష్‌కి కమిటీ సభ్యులు ఆజాద్ నాగసుధా కొండ, అడ బాల బుజ్జి శాలువా కప్పి సన్మానించారు. తదుపరి గత కొన్ని సంవత్స రాలగా లైటింగ్‌తో మండపం అలంకరణ ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాల విద్యార్థి గణపతి సంఘంకి సహకరిస్తున్న లోకనాథం ఉ లైటింగ్ యాజ మాని లైటింగ్ రమణికి ఎంపి హరిష్ చేతులమీదుగా శాలువాతో సన్మానం చేశారు.

టీచర్స్ ఒలింపిక్స్ పోటీలు

విశాలాంధ్ర - జగ్గంపేట : టీచర్స్ ఒలింపిక్స్ పోటీల్లో భాగంగా ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను స్థానిక గుర్రం పాలెం రోడ్డులోని గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీలు యుటిఎఫ్ కాకినాడ జిల్లా కార్యదర్శి పదాల వీర వెంకట సత్యనారాయణ, మాస్టర్ ఎస్ వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించగా, వాటిని తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడా స్ఫూర్తి బయట పడుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, మారిశెట్టి రాధ, దేవరపల్లి మూర్తి, కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి : కర్నాకుల

విశాలాంధ్ర - జగ్గంపేట : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేట కరణ చేయడాన్ని ఆపాలని విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయిం చాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మం డలంలోని రామవరం రంగవల్లి నగర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా కర్నాకుల మాట్లాడుతూ రాష్ట్రానికి గుండె లాంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ని ప్రైవేటీకరణ చేయడానికి మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుంద న్నారు. ప్రైవేటీకరణ ఆపాలని గత 1315 రోజులుగా ప్రజలు, ప్రజా సం ఘాలు, కార్మికులు పోరాడుతున్న, ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ఫ్యాక్టరీకి అవస రమైన మూడు సరుకులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీ ఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, జిల్లా కార్యదర్శి రమేష్, ఏఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు అంజిబాబు, దేవి, అర్జును పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా రవి వర్మ

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా పి రవివర్మ నియ మితులయ్యారు. ఇక్కడ పని చేసిన వెంకటరా మిరెడ్డికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కాకి నాడ మున్సిపాలిటీలో సానిటరీ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న ఈయనను ముమ్మిడివరం కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి అనిల్ కుమార్ సింఘల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రవి వర్మ ముమ్మిడివరం కమిషనర్‌గా రెండు సంవత్సరాలు పనిచేశారు.

పర్యటక రంగంపై పోటీలకు సన్నాహాలు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్క రించుకొని పర్యటక రంగం పై పోటీలకు సన్నాహాలు చేస్తున్నామని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పర్యటక రంగంపై 4 కేటగిరిల్లో తూర్పుగోదావరి జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేస్తు న్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యటక రంగం పై నాలుగు అంశాలలో వక్తృత్వ,క్విజ్,వీడియో రీల్, ఫోటోగ్రాఫీ విభాగాలలో ఆసక్తి ఉన్న ఓత్సాహిక యువతి,యువకులు పాల్గొని వారిలోని సృజనాత్మకత ప్రదర్శించేందుకు ఇదీ చక్కటి వేదికన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో పర్యటక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేసేలా వక్తృత్వం, క్విజ్, ఒక నిమిషం వీడి యో రీల్, ఫోటోగ్రఫీ కేటగిరి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటుకునేందుకు చక్కటి అవకాశం అని చెప్పారు. రాజమహేంద్రవరంలో పర్యాటకం , శాంతి, సుస్థిర ప్రయాణాలు, కలకాలం జ్ఞాపకాలు అంశంపై ఆంగ్లం లేదా తెలుగులో పాల్గొనవచ్చున్నారు. ప్రదర్శనకు సంబంధించి 5 నిమిషముల కాల వ్యవధి ఇస్తు న్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఉదయం 9.00 గంటలకు నన్నయ్య వర్సిటీ ఎన్టీఆర్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతి కేటగిరీ నుండి ఒక నామినేషన్ చొప్పున ఒక కళాశాల నుండి నాలుగు గరిష్టంగా నామినేషన్లు మాత్రమే అంగీకరించ బడు తాయని స్పష్టం చేశారు. కళాశాలలు ముందుగాని షార్ట్ లిస్టింగ్ చేసుకొని విద్యా ర్థులను పంపవలెనని పర్యటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి. స్వామి నాయుడు కోరారు. పోటీల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు మధ్య హ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గం" వరకు నిర్వహిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు క్షమాపణ చెప్పాలి

బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు గూడా సూర్య సందీప్

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఫ్లెక్సీని ఉండి నియో జకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు చింపడం దురదృష్టకరమైన సంఘటన అని కొవ్వూరు నియోజక వర్గం బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు గూడ సూర్య సందీప్ అన్నారు. ఫ్లెక్స్ చింపిన రఘు రామకృష్ణ రాజుపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకినాడలో దళిత ప్రొఫెసర్ పై దుర్భా షలాడిన ఎమ్మెల్యే పంతం నానాజీపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి తెలిపారు.

నావ నడవనిదే ... పూట గడవదు

దయనీయ స్థితిలో ఇసుక కార్మికులు

విశాలాంధ్ర - కొవ్వూరు : గోదావరి నది ఒడ్డున ఉన్న ఇసుక ర్యాంపులలో పని చేసే కార్మికులు దయనీస్థితిలో ఉన్నారు . వీరంతా ఉదయం రెండు గంటలకి నది వద్దకు చేరుకొని ఒడ్డున ఉన్న నావలపై నదిలోనికి వెళ్లి నీట మునిగి బకెట్ల ద్వారా ఇసుకను తీసి నావలో నింపి తిరిగి ఒడ్డుకు వచ్చి ఆ ఇసుకను గట్టుమీద దింపుతారు. అక్కడ నుంచి లారీల మీద వినియోగదారులకు అందుతుంది. అయితే ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉచిత ఇసుక విధానం తెస్తామంటూ ప్రభుత్వం ప్రకటిం చింది. విధానం తేవడంలో జాప్యం జరిగినప్పటికీ ఈ లోగా నది ఒడ్డున ఉన్న ర్యాంపులను గుర్తించమంటూ ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపధ్యంలో జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులు సహాయంతో ర్యాంపులను గుర్తించారు. దీనిలో భాగంగా రాజమండ్రి ర్యాంపులు దగ్గర్నుంచి కొవ్వూరు గామన్ ఇండియా బ్రిడ్జ్ వరకు సుమారు 48 ర్యాంపులను గుర్తించారు. వీటిలో సుమారు 40 ర్యాంపులకు అనుమతులు లభించినట్లు తెలుస్తోంది మిగిలిన ఎనిమిది రాంపులకు కూడా అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ నేపధ్యంలో జిల్లా కలెక్టర్ తర్వాత గతిన మిగిలిన 8 ర్యాంకులు కూడా అను మతులు ఇచ్చి రాంపులను మొదలుపెడితే తమ జీవితాలకి వెలుగు వస్తుందని కార్మికులు కోరుతున్నారు. ఇసుక బుకింగ్ కోసం పోర్టల్ ఏర్పాటు.. ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఇసుకను బుక్ చేసుకునేందుకు ఒక పోర్టర్ను ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయంలో ఇసుకను బుక్ చేసుకోవాలని సూచించింది.

స్వర్ణాంధ్ర-2047 గోడ పత్రిక ఆవిష్కరణ



విశాలాంధ్ర - పెదపూడి : వంద రోజులకే ప్రగతి నివేదిక ఇవ్వడమంటే కూట మి ప్రభుత్వ కార్యసాధన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ముందుచూపే కారణమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆది వారం పెదపూడి మండలం పుట్టకొండలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం లో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొని స్వర్ణాంధ్ర-2047 గోడ పత్రికను ఆవిష్కరిం చారు. అదే విధంగా 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పెం చిన పెన్షన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, రైతులకు ధాన్యం బకాయిలు తదితర అంశాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ నేతలు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి అయిన సందర్భముగా ఆత్రేయపురం మండలం ఆత్రేయపురం గ్రామ సచివాలయము వద్ద నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక మరియు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమములలో ముఖ్య అతిథులుగా కొత్తపేట నియోజకవర్గం శాసన సభ్యులు బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో బండారు సత్యానందరావు, కొత్తపేట నియోజక వర్గ శాసన సభ్యులు, గ్రామ సర్పంచ్ గెద్దం సుధ, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు ముదునూరి వెంకట రాజు, ఎంపీడీఓ నాతి బుజ్జి, సర్పంచులు కాయల జగన్నాధం, ముత్యాలబత్తుల రాజు, నరాలశెట్టి సుబ్బలక్ష్మి వెంకన్న, జుజ్జవరపు శ్యామల హరిబాబు, తోటకూర సుబ్బరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ఇతర ప్రజా ప్రతినిధులు ముందుగా ఆత్రేయపురం గ్రామ రావి చెట్టు సెంటర్ వద్ద అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా ర్యాలీలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి స్టిక్కర్ అంటించి, కరపత్రం ద్వారా కూటమి ప్రభుత్వం వందరోజులలో చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం సచివాలయం వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలిపారు. ప్లాంట్ ఫర్ మథర్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. స్వచ్ఛతాహి సేవా పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుతులు పంపిణీ చేశారు. పంచాయితీ పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ చేసి, వారిని దుశ్శాలువాతో సత్కరించారు. ఆత్రేయపురం మండలంలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి, రోడ్లు డ్రైనేజీల పనులు, పిచ్చుకలంక, లొల్ల పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, లొల్ల లాకుల ఆధునీకరణ, పులిదిండి బొబ్బర్లంక రోడ్డు అభివృద్ధి తదితర అభివృద్ధి పనులలో ప్రభుత్వం ఏవిధంగా ముందుకు కు తుందో వివరించారు. అదే విధంగా స్వచ్ఛ తాహి సేవా కార్యక్రమములో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని, పరిశుభ్రతే మన ఆరోగ్య ప్రగతికి దిక్సూచి అని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, మొక్కలు నాటి, పర్యా వరణ పరిరక్షణకు కృషి చేద్దాం అని తెలియ జేసారు. ఈ కార్యక్రమములో మండల స్థాయి అధికారులు ఈఓఆర్డీ శ్రీనివాస్, డీటీ ఇస్మాయిల్, ఏఈ సత్యనారాయణ, ఐసిడిఎస్ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రతపై అవగాహన

విశాలాంధ్ర - పెరవలి : క్లీన్ పెరవలి గ్రీన్ పెరవలి కార్యక్రమం లో భాగంగా ఆదివారం మండల కేంద్రమైన పెరవలి గ్రామంలో స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు, టీచర్స్ ఇంటింటికి తిరుగుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని వివరిస్తూ రోడ్లపై చెత్త వేయకుండా డస్ట్ బిన్ లు వాడకం పై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సేవా సంఘం కార్యదర్శి గుడివాడ బాలకృష్ణ, సభ్యులు వెంకటేశ్వరరావు, గుడి వాడ వెంకయ్య, గుడివాడ చిన్నశ్రీనివాస్, గుడివాడ శ్రీహరి, సత్య రామ్ ప్రసాద్, సలాది శ్రీహరి, బొడ్డు రామాంజనేయులు, రాజయ్య నాయుడు వశిష్ట స్కూల్ నిర్వాహకులు నారాయణరావు వశిష్ట వినియోదారుల సంఘం కన్వీనర్ ఉదయభాస్కరరావు ప్రైవేట్ స్కూలు టీచర్లు, పెరవలి గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - కొవ్వూరు : భారత్ వికాస్ పరిషత్ సంపార్క్ సంస్కర్ సహయోగ్ సేవా సమర్పన్ అనే అంశాలను పరిగణలోకి తీసుకొని భారతదేశంలో ఉన్న విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించుటకు దేశభక్తి బృందగాన పోటీలను హిందీ సంస్కృతము తెలుగు , జానపద గీతాలు పోటీలను , భారత్ కో జానో క్విజ్ పోటీలను ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు సంవత్సరం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తామని భారత్ వికాస్ పరిషత్ నేషనల్ సెక్రటరీ శ్రీ ధూళిపాళ పురోశోత్తమ శాస్త్రి అన్నారు. ప్రతీ భారత్ కో జాను నేషనల్ గ్రూప్ సాంగ్స్ కాంపిటీషన్స్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దోర్బల ప్రభాకర్ శర్మ శ్రీ టి ఎన్ వి రమణమూర్తి , విశాఖపట్నం ప్రాంత శ్రీ జి బి వి సుబ్రమణ్యం , కొవ్వూరు పురుషోత్తం, శాఖ అధ్యక్షులు డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. 15 టీంలు ఈ నేషనల్ గ్రూప్ సాంగ్స్ కాంపిటీషన్లో పాల్గొన్నాయని వీరిలో ప్రథమ విజేతలు ప్రాంత లెవెల్‌లో జరిగే పోటీలో పాల్గొనాలని డా రమేష్ తెలిపారు. విజేతలుగా ఎంపికైన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలతో అభి నందించారు. సుమారు 17 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. డి ఎ వి స్కూల్, కుమారదేవంన్రా హై స్కూల్ . మునిసిపల్ హై స్కూల్ సద్దు రు హై స్కూల్, సంస్కృత పాఠశాల, నారాయణ హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం

విశాలాంధ్ర - అల్లవరం : అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవంను ఓడలరేవు గ్రామ పంచాయితీ సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ ఉమామహేశ్వర రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కాయిస్ సంస్థ, సంయుక్తంగా స్వేచ్ఛ సాగర్, సురక్ష సాగర్ కార్యక్రమంలో సంకల్పించారు. రాష్ట్రంలో ఉన్న ఇతర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు , స్వచ్ఛంద సంస్థలతో కలిసి మన తీర ప్రాంత బీచ్‌లను రక్షించుకోవడం కోసం స్వేచ్ఛ సాగర్, సురక్షతా సాగర్ కార్యక్రమం మత్స్య శాఖ స్టేట్ కార్యదర్శి మానకపల్లి త్రిమూర్తులు అన్నారు. బీచ్‌లో ఉన్న చెత్త, ప్లాస్టిక్, పర్యావరణ హానికరం అయినా ఇతర వ్యర్థాలను వేరు చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అశ్విని, ఐఎన్‌సిఓఐఎస్ అధికారి అన్నపూర్ణయ్య, ఓడలరేవు మత్స్యకారుల సంఘ బీచ్ ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రేకాడి సత్యనారాయణ వర్మ, మెరైన్ ఇన్స్పెక్టర్ ఎమ్‌వివిఎస్ఎన్ మూర్తి, ఉమామహేశ్వరరావు, త్రిమూర్తులు, ధర్మరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వన్నె చింతలపూడిలో నిరసనలు

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ బ్యానర్‌ను తొలగించడం పై అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసనలు చేస్తూ, చట్టపరమైన చర్యలు రఘురామ కృష్ణ రాజు పై తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ బ్యానర్‌ను తీసివేయడం దారుణమని, వార్డు మెంబర్ నుండి ప్రధాని వరకు రాజ్యాంగం వల్లే అవుతున్నారని గుర్తు చేశారు. తక్షణమే రఘురాం కృష్ణంరాజును అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరమట మోహన్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పరమట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కుంచే సదా శివుడు, సెక్రటరీ కందేరి వెంకట రమణ, జాయింట్ సెక్రటరీ పరమట భీమ మహేష్, ట్రెజరరీ కుంచె వెంకటేష్, పరమట సురేష్, నక్కా రామకృష్ణ, కందేరి చిన సత్యనారాయణ, బుజ్జి, నక్కా రాజబాబు, రేవు జగదీష్, ఏలిపే ముత్యాలు బాబు, కుంచే నాని, అవినాష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : చేయూత రవి

విశాలాంధ్ర - కాకినాడ : స్వచ్ఛ సాగర్ - సురక్షిత సాగర్ నినాదంతో చేయూత సంస్థ ఆధ్వర్యంలో చేయూత సభ్యులు కాకినాడ పట్టణ ప్రజలు అత్యధిక సంఖ్యలో చిన్నారులతో బీచ్ క్లీన్ అప్ కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం నిర్వహించారు. చేయూత అధ్యక్ష, కార్యదర్శులు డా రవి కుమార్, అలీమ్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా తీసుకోగలిగితే ప్రజలందరినీ అనేక వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోగలమని పిలుపునిచ్చారు. బీచ్‌లో చెత్త భారీగా పేరుకుపోయిందని వాటిని క్లీన్ చేయడానికి తమ సభ్యులతో పాటు బీచ్ సందర్శకులు కూడా సహకరించారని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి, చేయూత పర్యావరణ విభాగం చైర్మన్ శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల శుభ్రత పై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. రోటరీ చేయూత భవన్ చైర్మన్ సురభి శారద మాట్లా డుతూ చిన్నారులు ఇప్పటి నుండే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తాము నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ కె చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో చేయూత ఆర్థిక కార్యదర్శి నారాయణమూర్తి రైతుకు వందనం చైర్మన్ చీకట్ల సత్యనారాయణ, బ్లడ్ విభాగం చైర్మన్ శ్రీని వాసరావు, చేయూత చిరు దీపం చైర్మన్ తేజస్వి, మహిళా విభాగం కార్యదర్శి అంగాడ లక్ష్మి, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, సైన్స్ టీచర్ రమణమూర్తి, వ్యవసాయ విస్తరణాధికారులు రత్న ప్రశాంతి, శ్రీధర్, పవన్ కళ్యాణ్, విజయ్, శివ మాధవ్, సత్య పాల్గొన్నారు.

చంద్రబాబుది డైవర్షన్ రాజకీయం : తోట

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైసిపి తోట నరసింహం విమర్శించారు. కిర్లంపూడి మండలం వీరవరంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా, చెప్పిన పనులు చేయలేదన్నారు. ప్రజల్లోకి వెళితే ఇచ్చిన హామీల గురించి అడుగుతారని, రాష్ట్రంలో లడ్డు ప్రస్తావనే ఉండాలని చంద్రబాబు ప్రజలను పక్కతోవ పట్టిస్తున్నారన్నారు. వారు తప్పుకునేందుకు జగన్‌పైనా, వైసీపీపైనా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత దీక్ష చేస్తున్నారా, ప్రశ్చాత్తాప దీక్ష చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీపీ దొరబాబు, పార్టీ నాయకులు రాంజీ, గణేష్ రాజా, ఉన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మెట్ట ప్రాంత ప్రధాన సంజీవనిగా పిలువబడే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో-చైర్మన్లుగా వాగు రాజేష్, జొన్నాడ వీరబాబులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నూతన కో చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన, మైదాన ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల సేవలు అభినందనీయమని ఆమె కొనియాడారు. నూతన కో-చైర్మన్లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్‌లు మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టిడిపి నాయకులు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, ఎంపిపి నరసింహ మూర్తి, నారాయణస్వామి, వెంకటరమణ, నాగబాబు, వైద్యాధికారులు ఉన్నారు.

తిరుపతి లడ్డూపై టీడీపీ రాజకీయం : చిర్ల జగ్గిరెడ్డి

విశాలాంధ్ర - రావులపాలెం : చంద్రబాబు నాయుడు 100 రోజుల పరిపాలనలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద అసత్య ప్రచారాలు చేస్తున్నారని శనివారం రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు చెప్పాలి కానీ మీకు మీరు మీటింగులు పెట్టుకుని చెప్పుకూడదని చిర్ల అన్నారు. కలియుగ దైవమైన తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి లడ్డుపై రాజకీయం చెయ్యటంపై చిర్ల మండిపడ్డారు. మీరు హిందువుల ఆత్మ గౌరవం దెబ్బతినేలా చేస్తున్నారని మీకు అంత నిబద్ధత ఉంటే జూలై 23వ తారీఖున మీకు రిపోర్ట్‌లో నిజం తెలిసినప్పుడు ఇప్పటి వరకు గుడ్డి గుర్రం పళ్లు తోమారా అని చిర్ల అన్నారు. మొట్టమొదటిగా మీరు చెప్పిన సూపర్ సిక్స్ అంశాల్లో ఉన్న పథకాలను ఏ ఒక్కటి చేయలేదు. అందుకు మీది మంచి ప్రభుత్వం అని ప్రజలు చెప్పాలా. అదేవిధంగా జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గవర్నమెంట్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియంను రద్దు చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు వేగవంతం

విశాలాంధ్ర-దేవరపల్లి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో రాష్ట్రం సర్వతో అభివృద్ధి చెందటంతో పాటు మంచి పారదర్శక పాలన అందించిందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో శనివారం టిడిపి సీనియర్ నేత కొయ్యలమూడి చినబాబు స్వగృహ వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ 100 రోజులు నుండి రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా అమలు జరుగుతున్నాయని అన్నారు . అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రంలో మంచి పరిపాలన జరుగుతుందదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మొదటి నెలలోనే అమలు జరిపిన ఘనత కూటమి ప్రభుత్వందేనని అన్నారు. ప్రతి పేదవాడు అభివృద్ధికి పారదర్శక పాలన అందిస్తామని మద్దిపాటి అన్నారు. గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఫైర్ స్టేషన్ ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేస్తామని అన్నారు . రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక అడుగు వేసే ప్రసక్తే లేదు అని అన్నారు. వైసిపి ప్రభు త్వంలో రాక్షస అరాచక పాలనను ప్రజలు చూశారని ఆయన విమర్శించారు. ప్రజావేదిక కూల్చటం తోనే వైసిఎం ప్రభుత్వం పతనం ప్రారంభమైందని మద్దిపాటి అన్నారు. నియోజకవర్గంలో రూ.21 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు రైతులకు 250 మినీ షెడ్లు నిర్మాణం చేపడుతున్నామని రానున్న రోజులలో గోపాలపురం నియోజక వర్గంలో 800 కోట్ల రూపాయలతో ఒక సమస్య ముందుకొచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కొయ్యలమూడి చినబాబు, టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి సుధారాణి, మండల టీడీపీ అధ్యక్షుడు అనిల్, మాజీ అధ్యక్షుడు దుర్గారావు నేతలు హరికృష్ణ, ప్రసాద్, నల్లమాటి నాగేశ్వర రావు, శ్రీనివాసరావు,చింతల దాసు , ప్రసాద్ కంటిపూడి సుబ్బారావు, సత్యనారాయణ, ప్రభాకర రావు, సూర్యనారాయణ, తహశీల్దార్ రాజ్యలక్ష్మి ఎంపీడీవో ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

వరద బాధితులకు గాయత్రి యాజమాన్యం ఆపన్నహస్తం

విశాలాంధ్ర - రాజానగరం : బుడమేరు కాలువకు గండ్లు పడడంతో రాష్ట్రంలోని విజయవాడ అతలాకుతలమైన సంగతి అందరికి తెలిసిందే. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పెద్ద మనసుతో అనేక మంది దాతలు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద బాధితులకు అండగా నిలిచేందుకు మండలంలోని కానవరం గ్రామానికి చెందిన గాయత్రి, కోరుకొండలోని సృజన విద్యా సంస్థలు చైర్మన్ వివివి ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహారం పొట్లాలు అందించేందుకు ఆదివారం తరలివెళ్ళారు. దీనిలో భాగంగా అక్కడ 500 కుటుంబాలకు ఆహార పదార్థాలు అంద జేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలు చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయి డెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ఏపీపియుఎస్ఎంఏ)సంయుక్త జిల్లా కార్యదర్శి వివివి ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తమ విద్యాసంస్థకి చెందిన విద్యార్థులు, అధ్యాపక బృందం సహకారంతో నాలుగు లక్షల వ్యయంతో నిత్యా వసరాలను సమభాగాలుగా విభ జించి ఐదు వందల కుటుంబాలకు అం దించి నట్లు చెప్పారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A.687/2023, I.A.688/2023
I.A.352/2022
I.A.353/2022 in O.S.406/2017

Between:
Sape john Paul Raju ***...Petitioner***
AND
Sri Konku Subbarao,S/o.Mala Kondayya, Hindu, aged 46 years, R/o. D.No. 80-16-27/3, Srinivasa Nagar, Rajahmahendravaram, E.G.Dist. ***...Respondent***

పై నంబరు పిటీషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది.14-10-2024 సం॥రం తేదీ ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.భరణికుమార్

రాజమండ్రి 23-09-2024 అడ్వకేటు రాజమండ్రి

బీసీ కులగణనపై బీఎస్పీ రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - అమలాపురం : బహుజన్ సమాజ్ పార్టీ బిసిల కులగణన అంశం పై రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలను జరుపుతున్నది. అందులో భాగంగా డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బహుజన సమాజ్ పార్టీ అమలాపురంలోని ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు కుసుమ వెంకటేశ్వర రావు ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షులు బి పరంజ్యోతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసమావేశంలో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంఎల్ఏ పంతం నానాజీ దళిత డా ఉమామహేశ్వరావు పై భౌతిక దాడి ఘటన, ఉండి నియోజకవర్గం కాళ్ళ మండలం ఏలూరుపాడులో టిడిపి ఎంఎల్ఏ రఘురామ కృష్ణంరాజు స్వయంగా రాజ్యాంగ నిర్మాత డా అంబేద్కర్ ఫ్లెక్సీని చించడాన్ని తీవ్రంగా ఖండించింది. బిసి కులగణన పై జరిగిన చర్చలో రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ దేశవ్యాప్తంగా జనగణనతో పాటు బిసి కుల గణనను డిమాండ్ చేస్తున్నా మని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వైసీపీ పార్టీలన్ని 242 కులాలకు దక్కా ల్సిన అవకాశాలను కమ్మ, రెడ్డిలే అనుభవిస్తు న్నారని, అందుకు అసెంబ్లీలకు ఎన్నికైన ఎంఎల్ఏల జాబితాను పరిశీలిస్తే ఆశ్చర్యం, ఆం దోళన కలిగిస్తుందని అన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, పార్లమెంట్ ఇంచార్జ్ యాళ్ల దొరబాబు, జిల్లా ఇంచార్జి కాశి లక్ష్మి భవాని, సీనియర్ బిసి నాయకులు వేణుగోపాల్, కాకినాడ పార్లమెంట్ ఇంచార్జ్ నరసింహం, జిల్లా ఉపాధ్యక్షులు, ముమ్మిడివరం నియోజకవర్గం ఇంచార్జ్ వాకపల్లి భీమా రావ్, ట్రెజరర్ రాజారావు, అమలాపురం నియోజక వర్గం ఇంచార్జి మోహన్, నియోజకవర్గాల అధ్యక్షులు భీమేశ్వర రావు(ముమ్మిడివరం), పెండెం శ్రీనివాస్ (అమలాపురం), తాడి రాంబాబు (గన్నవరం), ఆకుమర్తి భూషణం(రాజోలు), మేడా శ్రీనివాసరాజు, బొంతు కోటేశ్వరరావు, జైభీమ్ చంద్ర, దుర్గారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంతం 'నానాజీ' ని అరెస్టు చేయాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు సత్తిబాబు

విశాలాంధ్ర - రాజానగరం : రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరావు పై దాడి చేసి చంపేస్తానని బెదిరించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తన అనుచరులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు జున్నుపల్లి సత్తిబాబు, పి.వెంకట్ నాయుడు డిమాండ్ చేశారు.ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను ఆదివారం విడుదల చేశారు.దీనిలో భాగంగా వారు మాట్లాడుతూ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ప్లే గ్రౌండ్ లో వాలీబాల్ఆట అనుమతి కోసం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తన అనుచరులతో కలిసి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ మహేశ్వరరావు పై శనివారం విచ్చలవిడిగా బూతులు తిడుతూ దాడి చేయడాన్ని ఖండించారు. ప్రజాప్రతినిధిగా ప్రజాస్వామ్యాన్ని రక్షించవలసిన ఎమ్మెల్యే తన అనుచరులతో మెడికల్ కాలేజీలో భయంకరమైన వాతావరణ సృష్టించి మెడికల్ విద్యార్థుల ముందే ప్రొఫెసర్ ను కొట్టడం చంపేస్తానని బెదిరించడం దాడి సమయంలో అడ్డువచ్చిన డాక్టర్ విద్యార్థులను కొట్టడం సరికాదని మండిపడ్డారు. నేరానికి పాల్పడిన ఎమ్మెల్యే పంతం నానాజీ పై తను అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వివిధ సెక్షన్లతో కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపము ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నానాజీని, తన అనుచరులను అరెస్టు చేయించి ప్రజలపై తముకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలనీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డాక్టర్లతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

విజయవాడ వరద బాధితులకు పిఆర్‌జీ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ సాయం

విశాలాంధ్ర - కాకినాడ : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయం అందించేందుకు పిఆర్ గవర్నమెంట్ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్ అసోసి యేషన్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయం అని కాలేజ్ ప్రిన్సిపల్ తిరుపాణ్యం పేర్కొన్నారు. కాకినాడ పిఆర్ గవర్నమెంట్ కాలేజ్ గౌండ్లో గ్రౌండ్ యూజర్స్ అసోసియే షన్ సభ్యులు కాలేజ్ ప్రిన్సిపాల్ తిరుపాణ్యంకు వరద భాదితుల సహాయార్థం విరాళంగా చెక్కును అందించారు. ప్రిన్సిపాల్ తిరుపాణ్యం గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులను కలసి అభినందించారు. గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సెక్రటరీలు పంపన సాయి, తలాటం హరీష్ మాట్లాడుతూ తమ సభ్యులు ప్రభుతానికి అండగా సిఎం సహాయనిధికి లక్ష నూట పదహారు రూపాయలు అందించామన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ కాలేజ్ అభివృద్ధిలో దాతలు గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు అందిస్తున్న సేవలను అభినందించారు. అసోసియేషన్ సభ్యుడు ముప్పన పురుషోత్తం మాట్లాడుతూ కాలేజ్ అభి వృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, వర్మ, పిడి వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (పశ్చిమ), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం.: U65922MH2005PLC272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం – 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) నిబంధనలు–2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని, ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీ దారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు & రుణఖాతా సంఖ్య	డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి	ఆస్తి వివరాలు	స్వాధీనత తేదీ & రకం
1	వై వి రామారావు సాదనాల, దేవి సాదనాల HL0000000012512	20-మే-24 15-మే-24 నాటికి రూ.1212734/-	డి నెం. 3-113/1, ఆర్.ఎస్.నం.206/2, గూడపల్లి గ్రామం, గూడపల్లి గ్రామ పంచాయతీ, మలికిపురం మండలం, నూకాలమ్మ గుడి, గూడపల్లి ఆంధ్రప్రదేశ్-533253, ఆస్తి ఏరియా: 193.6 చదరపు గజాలు లేదా 162.64 చదరపు మీటర్ల విస్తీర్ణం.	లాంఛన ప్రాయ స్వాధీనత; తేదీ: 17-09-2024
2	సూర్యచంద్రరావు దిరిసాల (మరణించినప్పటి నుండి)కు చెందిన చట్టబద్ధ వారసులందరూ (రుణగ్రహీత), వరలక్ష్మి దిరిసాల లేటు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల భార్య (సహ-రుణగ్రహీత) మరియు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల (మరణించినప్పటి నుండి) యొక్క చట్టబద్ధవారసురాలు, నాగరాజు దిరిసాల లేటు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల కుమారుడు (సహ-రుణగ్రహీత) మరియు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల (మరణించినప్పటి నుండి) యొక్క చట్టబద్ధవారసుడు, మహేష్ లేటు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల కుమారుడు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల (మరణించినప్పటి నుండి) యొక్క చట్టబద్ధవారసుడు, దుర్గా ప్రసాద్ లేటు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల కుమారుడు శ్రీ సూర్యచంద్రరావు దిరిసాల (మరణించినప్పటి నుండి) యొక్క చట్టబద్ధవారసుడు. LP0000000017808	28-మే-24 28-మే-24 నాటికి రూ.1208123/-	డి నెం. 5-17, ఆర్ఎస్.నం. 274/7, లక్కవరం గ్రామం, సాయిబాబా గుడి, లక్కవరం గ్రామం, మలికిపురం మండలం, ఆంధ్రప్రదేశ్-533254, ప్లాట్/నిర్మిత ప్రదేశం ఏరియా కొలత: డోర్ నం.5-17 ఆధారంగా ఉన్న ఆర్‌సిసి భవనంతోపాటు 145.2 చదరపు గజాలకు సమానమైన ఎ.సి. 0-03 సెంట్లు స్థలం.	లాంఛన ప్రాయ స్వాధీనత; తేదీ: 17-09-2024
3	వీర దుర్గా గణేష్ కర్రా, సత్యనారాయణ కర్రా, కృష్ణార్జునరావు కర్రా, జయలక్ష్మి కర్రా LP0000000056114	20-జూన్-24 13-జూన్-24 నాటికి రూ.3670200/-	డి.నం. 2142 దగ్గర, ఎస్.నం. 162/3ఎ, 162/3ఎ1, జెడ్ రాగంపేట శివారు నీలాద్రిరావుపేట గ్రామం మరియు జగ్గంపేట గ్రామ పంచాయతీ, గండేపల్లి మండలం, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్-533435, కొలత: 347-11 చదరపు గజాల నుంచి 249-11 చదరపు గజాలు,	లాంఛన ప్రాయ స్వాధీనత; తేదీ: 19-09-2024

తేదీ : 23.09.2024
ప్రదేశము : మలికిపురం, తూర్పుగోదావరి

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

స్వర్ణాంధ్ర 2047 సాధనలో భాగస్వామ్యం అవ్వండి

- క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి, అభిప్రాయాన్ని తెలియచేయండి
- కలెక్టర్ ప్రశాంతి

Scan me !

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : స్వర్ణాంధ్ర 2047 కోసం ప్రజలు, విజ్ఞులు, విభిన్న రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపే వ్యక్తులు, సంస్థల తరపున ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు తమ అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వడం ద్వారా స్వర్ణాంధ్ర సాధనలో పాలుపంచుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఒక మహోన్నత లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నీ విధాలుగా అభివృద్ధి చేసే విధానంలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. అందులో తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని వర్గాలకి చెందిన వారు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి, మీ పేరు, ఫోన్ నెంబర్, ఈ మెయిల్, ఇతర వివరాలు పొందుపరచాల్సి ఉందన్నారు. మీ మొబైల్‌కి వచ్చే ఓటిపి నమోదు చేసి, ప్రశ్నావళిలో ఇచ్చిన ప్రతిపాదనలని మీ ఐచ్ఛికం లేదా మీ అభిప్రాయాన్ని తెలియజేయగలరు. పూర్తిగా ప్రశ్నావళి పూర్తి చేసిన తదుపరి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోతో కూడిన సర్టిఫికేట్ జారీ చెయ్యడం జరుగుతుంది.. వాటిని డౌన్లోడ్ చేసుకుని ఉచితంగా పొందవచ్చునని తెలియ చేశారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా అనపర్తి : ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి : వలంటీర్ల వ్యవస్థ లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలన ముందుకు సాగదు అనే ఒక అభిప్రాయం ప్రజలు, కోర్టులు, ఎన్నికల కమిషన్ ముందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చి మూడు నెలల పాటు ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని అస్తవ్యస్తం చేశారని, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. కొమరిపాలెంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొని ప్రసంగించారు. జూలై నెలలో వలంటీర్లు లేకుండా ఒకే రోజులో 98 శాతం ఫించన్లు పంపిణీ చేయగా ఆగస్టు, సెప్టెంబర్‌లో ఉదయం ఐదు గంటల నుండి 10 గంటల లోపే 96 శాతం పింఛన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎమ్మెల్యే చెప్పారు. ఇచ్చిన మాట తప్పకుండా వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు 6 వేలు ఇస్తు న్నారని అన్నారు. అదే విధంగా బిక్కవోలు గోలింగేశ్వర స్వామి, గొల్లల మామిడాడ రామాలయం, సూర్యనారాయణ మూర్తి ఆలయం ఇవన్నీ కలిపి ఒక టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు రూ.50 కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దే ప్రయత్నం జరుగుతోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇంకా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజక వర్గంలో పలు రోడ్ల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి వివరించారు. మాజీ జడ్పిటిసి పడాల వెంకట రామారెడ్డి, ఎన్‌డిఏ నేతలు సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణం రాజుపై చర్యలు తీసుకోవాలి
ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండు

విశాలాంధ్ర - అల్లవరం : ఉండి నియోజకవర్గం కాళ్ళ మండలం ఏలూరుపాడు గ్రామంలో జరిగిన సంఘటన దళితుల ఆత్మాభిమానాన్ని కించపరిచే విధంగా ఉందని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల నకుల రాజు, గోసంగి బంగార్రాజు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించే విధానం చూస్తే దళితులపై అతనికి ఎంత కక్ష ఉందో అర్థమవుతుందని అన్నారు. దళిత సామాజిక వర్గ ఓట్లతో గెలిచిన కృష్ణంరాజు దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవ ర్తించడం సరికాదని అన్నారు. మరోపక్క కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరావు పై కాకినాడ ఎమ్మెల్యే అతి క్రూరంగా దాడి చేయడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. దళిత ఉద్యోగులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, నేరేడుమిల్లి సత్యనారాయణ, గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్, బిఎస్సార్ ప్రసాద్, గోసంగి ఆనందరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
-జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బిటెక్ ఈసిఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని మేకా వర్షిత తన పుట్టిన రోజును వినూత్నంగా జరుపుకుని తోటివారికి ఆదర్శంగా నిలిచింది, తన పుట్టిన రోజు సందర్భంగా తన సహచర విద్యార్థులు, స్నేహితులకు స్వీట్స్‌తో పాటుగా మొక్కలు పంచి పెట్టి తనకు గుర్తుగా మొక్కలు తమ ఇంటి వద్ద నాటాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ కుమారి వర్షితకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు మరియు ప్రత్యేక పర్వదినాలు జాతీయ పండుగలు తదితర సందర్భాలలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పుట్టిన రోజు సందర్భంగా ఆదర్శంగా మొక్కలు పంచి వేడుక జరుపుకున్న వర్షితను ఈసిఈ విభాగాధిపతి డా సంజయ్ కుమార్, క్యాషియర్ పెను మల్లు సత్యనారాయణ రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కావ్య మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని మడికి గ్రామంలో డాక్టర్ సింగలూరి కావ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. డాక్టర్ సింగలూరి కావ్య జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యానందరావుకు వివరించారు. ఈ మేరకు కావ్య మెమోరియల్ ట్రస్ట్ వారిని, సేవలు అందిస్తున్న వైద్యులను, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం చెముడులంకలోని నేతాజీ స్కూల్ యాజమాన్యం తరపున ముఖ్యమంత్రి సహాయ నిధిగా 30 వేల రూపాయల బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దొండపాటి సుబ్బరాజు, మెర్ల గోపాలం, నాగిరెడ్డి వెంకటరత్నం, అడ్డాల సత్యనారాయణ రాజు, మల్యాల రాజేష్, ఈదల రమేష్, కొత్తపల్లి కృష్ణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి వెంకటరత్నం, తెలుగు దేశం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి, సానబోయిన లక్ష్మణస్వామికి సీపీఎం నాయకుల సంతాపం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి , ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు సానబోయిన లక్ష్మణస్వామిలకు సీపీఐ నాయకులు సంతాపం తెలియజేశారు. ఈసందర్భంగా ముమ్మిడివరం నియోజవర్గ సమావేశం నిర్వహించారు. పచ్చమట్ల సత్యనారాయణ రాజు అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సత్తిబాబు మాట్లాడుతూ దేశంలో పాసిస్టు శక్తులు మతోన్మాదులు విజృంబణకు సెక్యులర్ శక్తులకు ఐక్యతే అడ్డుకట్టని, ఆ దిశగా సీతారాం ఏచూరి భారత రాజకీయాలలో తనదైన శైలిలో సామాన్యులు పేద ప్రజల ప్రయోజనాల కోసం జీవితకాలం ఉద్యమించిన మార్క్సిస్టు మేధావి ఏచూరి అని తెలియజేశారు. అదేవిధంగా ప్రజాసంఘాల నిర్మాణం పార్టీ వనరులు సమీకరణ డిసెంబర్ 26 పార్టీ శత వసంతాల సంబరాలు నిర్వహణతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ముమ్మిడివరం ఏర్పాటు చేసి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనచర్ల విజయకుమార్, శీలం వెంకటేష్, సానబోయిన మనోహర్, బుంగ కుమార్, మోర్త కొండయ్య, బూరుగు సీతారత్నం, బీర శాంతమ్మ, పెయ్యల దమయంతి, గాలి పాలమ్మ, గాలి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు భాగేష్ ఎంపిక

విశాలాంధ్ర - అంబాజీపేట : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు తైక్వాండో క్రీడాకారుడు అప్పారి భాగేష్ చైతన్య ఎంపికైనట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో చైతన్యను పలువురు క్రీడాకారులు ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అం డర్-19 స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలలో భాగేష్ చైతన్య అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీ లకు ఎంపికయ్యాడన్నారు. త్వరలో రైల్వే కోడూరులో జరుగు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో చైతన్య పోటీలో ఉంటారని తెలిపారు. బాగేష్ చైతన్యను ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయి రామ్, పీడీ తెదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి. పీఎంసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం దీప్తి విద్యా సంస్థల సాయం

విశాలాంధ్ర - మామిడికుదురు : విజయవాడ వరద బాధితుల సహాయం కోసం మామిడికుదురు, నగరం దీప్తి విద్యా సంస్థలు రూ.50 వేలు సాయాన్ని అందజేశారు. ముఖ్య మంత్రి సహాయ నిధికి రూ.40 వేలు చెక్కుని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఆదివారం దీప్తి చైర్మన్ డివివి సత్యనారాయణ, సాయి దీప్తి ప్రిన్సిపాల్ జక్కంపూడి శివప్రసాద్ అందజేశారు. అలాగే ఇటీవల పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ద్వారా రూ.10 వేలు విలువ చేసే బియ్యాన్ని కూడా అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దీప్తి, సాయి దీప్తి పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు యక్కలదేవర నాగన్నబాబు, గుబ్బల మౌనిక, జక్కంపూడి బాబి, గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి తదితరులు ఉన్నారు.

సూర్యారావుపేటలో భారీ అన్నదానం

విశాలాంధ్ర - కరప : కరప గ్రామం సూర్యారావు పేటలో భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ప్రసన్న గణపతి కమిటీ సభ్యులు ఆటో అనౌన్స్‌మెంట్ ద్వారా కరప చుట్టుపక్కల గ్రామాలు భారీ అన్నదానాన్ని జయప్రదం చేసేలా ప్రచారం నిర్వహించారు. దీంతో నలుమూలల నుండి గణేష్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ అన్నదాన కార్యక్రమాన్ని జయప్రదం చేశారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞులు చాగంటి సూరిబాబు పాల్గొని గణపతికి వేదమంత్రాలతో పూజలు నిర్వహించి భారీ అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 2000 మందికి పైగా ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి నాయుడు, బోళ్ల రామకృష్ణ, నెల్లి సురేష్, కే నాని, పి స్వామి, జి జాను, పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జిల్లా అండర్-14 క్రికెట్ టీం ఎంపిక

విశాలాంధ్ర-లింగపాలెం: క్రికెట్ అండర్-14 జిల్లా క్రికెట్ టీం ఎంపిక ఏలూరులోని ఆశ్రమం కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహిం చారు.ఎంపిక పోటీల్లో లింగపాలెం మండలం ధర్మాజీగూడెంకు చెందిన నాల్గవ తరగతి చదువుతున్న సొంగాప్రదీప్ సహాయ్ పాల్గొన్నాడు. విశాలాంధ్ర విలేఖరి ఎస్.డి.వి.ప్రసాద్ మనవడు లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సందీప్, బ్యాంకు ఉద్యోగి ఇందు దంపతుల కుమారుడు క్రికెట్ లో శిక్షణ పొందుతూ అండర్-14జిల్లా జట్టు ఎంపిక పోటీలలో పాల్గొన్నాడు. వయసు సరిపోవకపోవడంతో సెలెక్టర్లు ఎంపిక చేయలేదు.అయితే క్రికెట్లో ప్రతిభ చూపిన ప్రదీప్ సహయను సెలెక్టర్లు అభినందించారు. భవిష్యత్తులో మంచి క్రికెటర్‌గా ఎదుగుతాడని సెలెక్టర్ లు పేర్కొన్నారు. జిల్లా టీం ఎంపికలో దాదాపు 70 మంది క్రికెట్ క్రీడాకారులు హాజరయ్యారు. ఎంతో ఉల్లాసభరి తంగా సాగిన క్రీడాకారుల ఎంపికలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా టీంకు ఎంపిక చేశారు. జిల్లా క్రికెట్ సెలక్షన్ కమిటీలో ఈ ఎంపిక జరిగింది.

రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా స్వామి మాస్టారు

విశాలాంధ్ర-కాళ్ళ : రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా స్వామి మాస్టారు ఎంపికయ్యారు. సీఐఈటీ - ఎన్ సి ఈ ఆర్ టి న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కొరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్లలో ఆన్లైన్ శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా రెండవ ఫేజ్ లో ఈ నెల 23నుంచి 27వ తేది వరకు ఐదు రోజుల ఆన్లైన్ శిక్షణలోఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన 20 మంది ఎస్ ఆర్ జి ల్లో పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలి ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపికైనట్లు కాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఏ. రవీంద్ర తెలిపారు.ఇంతకుముందు ఈ కంటెంట్‌లో భాగంగా మూడవ తరగతి గణితము నకు సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ పాఠశాల ఆప్, ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపరచడం జరిగిందని స్వామి మాస్టారు వివరిం చారు.ఈ శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకొని చక్కని ఈ కంటెంట్ రూపకల్పనకు కృషి చేస్తానని స్వామి మాస్టారు తెలిపారు.ఇంత చక్కని దేశవ్యాప్త శిక్షణకు ఎంపికైన స్వామి మాస్టారును ఎంఈఓ2 వేంద్ర వెంకటేశ్వర రావు, పలు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

పాము కాటుతో బాలుడు మృతి

విశాలాంధ్ర-టి.నరసాపురం:పాము కాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన బొర్రంపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటన పై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి గ్రామానికి చెందిన దుగ్గిరాల జేసుకుమార్(15) మూడు రోజుల క్రితం మండలంలోని బొర్రంపాలెంలో తన మేనత్త గంగమ్మ ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి బాలుడు ఇంట్లో నిద్రిస్తుండగా అతని చెవిని కట్లపాము కరిచిందని వెంటనే అతని బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ ఎం జయబాబు తెలిపారు.

కాగితం వారి వీధిలో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : స్థానిక 9వ వార్డు కాగితం వారి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి వినాయక చవితి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1500 మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీద్ సెంటర్, గుణ్ణం వారి వీధి, కాగితంవారి వీధి , తొమ్మిదో వార్డు ప్రజల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. విందు భోజనాలను తలపించే రీతిగా అన్న సమారాధన జరిపామని రానున్న కాలంలో ప్రజలందరూ ఆనందంగా ఉండడానికి ఈ ఉత్సవాలను కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు.

టెన్త్ విద్యార్థులకు నగదు పురస్కారాలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : ప్రతిభావంతులైన విద్యార్థులకు ది. సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రోత్సాహకాలు అందించింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెనుమత్స రంగరాజు మాట్లాడుతూ ఇంటర్, పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందిస్తున్నామన్నారు. స్థానిక కార్యాలయంలో విద్యార్థులు కొప్పిశెట్టి సుజనా హరిణి, వై మోనిషా, వై ఎన్ వి యువశ్రీ, జె వి ఎస్ దుర్గా కుమార్ సక్కా శ్రీనివాస్, అయినాల సురేంద్రలకు నగదు పురస్కారాన్ని అందజే శారు. ఈ కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయ కులు గరికిపాటి బాపయ్య శర్మ, బ్రాంచ్ మేనేజర్ లోవరాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి వెయ్యి రూ. పెంచిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామం సచివాలయం వద్ద మండపేట శాసన సభ్యులు వేగుళ్ల జోగేశ్వర రావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజులు ఎన్డీఏ కూటమి పాలనలో అమలు చేసిన హామీలు ప్రైముద్రించిన కర పత్రాలు ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ సాకా శ్రీనువాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్ఎల్ఏ వేగుళ్ల పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మూడు వేలుగా వున్న సామాజిక పెన్షన్లు ఒకేసారి వెయ్యి రూపాయిలు పెంచి నాలుగు వేలు ఇచ్చారని, మెగా డిఎస్సీ అమలు, వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఐదు రూపాయలకే పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్ వంటి ఐదు నిర్ణయాలపై ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే వేగుళ్ళ పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన బుడమేరు వాగు ఉగ్రరూపంతో ముంచెత్తిన విజయవాడ వరద ప్రాంతాలను పది రోజులపాటు స్వయంగా సీఎం చంద్రబాబు పర్యటించి సహాయ సహకారాలు అందించారని, ఎంఎల్ఏ కొనియాడారు. సర్పంచ్ శాకా శ్రీనివాస్, మాజీ పిఏసీఎస్ చైర్ పర్సన్ నెక్కంటి రాంజీ, పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, కొప్పిసెట్టి వాసు, తదితరులు ప్రసంగించారు. కపిలేశ్వరపురం మండలం పరిధిలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లు అందచేశారు.

తిరుమల లడ్డూ కల్తీ పై కేంద్ర దర్యాప్తు సంస్థచే విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై కేంద్రం దర్యాప్తు సంస్థచే విచారణ చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం డిమాండ్ చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు అన్నవరం, సింహాచలం అన్ని ఆలయాల్లో కల్తీ నెయ్యి వుందని అనుమానం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం భక్తుల కిచ్చే లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో తయారు చేయించి అపచారం చేసారని ఆరోపించారు. శ్రీవారి ఆలయం ప్రాంగణంలో జరిగిన తప్పిదానికి సంప్రోక్షణ చేసి హిందూ ధర్మాన్ని ఆలయ పవిత్రతను భక్తుల మనో బావాలను కాపాడాలని కోరారు. రివర్స్ టెండరింగ్ వేసి ఖర్చు తగ్గించామని వైసిపి ప్రభుత్వంలో టీటీడీ ధర్మకర్తల కమిటీ గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రసాదాల నాణ్యత లేకుండా చేసారని దుయ్యబట్టారు. సనాతన ధర్మంపై కుట్ర చేశారని ధ్వజమెత్తారు. అప్పటి వైసిపి ప్రభుత్వంపై టిటిడీ బోర్డుపై సీబీఐ విచారణ చేయాలన్నారు. నిజానిజాలు బహిర్గతం చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పాలూరి డిమాండ్ చేసారు.

దెబ్బతిన్న ఇళ్లను ప్రభుత్వం ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సెప్టెంబర్ నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు కారణంగా మండలంలో, పరింపూడి, మంగపతి దేవి పేట, ఎర్రంపేట, రాజవరం, దిప్పకాయలపాడు గ్రామాలలో ఆరు కుటుంబాల వారికి చెందిన ఆరు ఇళ్లు పడిపోవడంతో, ప్రభుత్వం తరపున వారికి రెండు రోజులలో ఆర్థిక సహాయం అందచేయడం జరుగుతుందని, తాసిల్దార్ చల్లన్న దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఏమైనా ఇళ్లు వర్షా ప్రభావంతో దెబ్బతిని ఉంటే తాసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం 10 గంటలకల్లా తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలను ఆయా గ్రామ పంచాయతీల కార్యాలయాల వద్ద ప్రచురణ చేయడం జరిగిందని, తాసిల్దార్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-భీమవరం: ఎన్ఎస్ఎస్ మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఏర్పడిందని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవలో ముందుండాలని ఆదికవి నన్నయ్య యునివర్సిటీ, పీజీ సోషల్ వర్కర్స్ హెడ్, మాజీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ నిట్టల కిరణ్ చంద్ర అన్నారు. బీ.వీ.రాజు పార్క్ ఆవరణలో శ్రీవిజ్ఞానవేదిక, ఆర్.ఆర్.డి.ఎస్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఎన్ఎస్ఎస్ దినోత్సవ బ్రోచర్ ను కిరణ్ చంద్ర ఆవిష్కరించారు. మూడు రోజులపాటు పట్టణంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేజీఆర్ఎల్ కళాశాల సంయుక్త కార్యదర్శి అరేటి ప్రకాష్, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ దేశ భక్తి జాతీయ సమైక్యత ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ ద్వారా వస్తాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 23న ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద 30 మంది ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా సత్కరిస్తున్నామని, 24న ఆర్.ఆర్.డి.ఎస్ కళాశాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆర్.ఆర్.డి.ఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాస్ రావు, పి.అమూల్య రావు, ఎస్ కే చాన్ భాషా, ఏఎస్ఆర్ శాస్త్రి, చల్లా రాము, పి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజవరం గ్రామంలోని ఇది మంచి ప్రభుత్వం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రం రాజవరం గ్రామంలోని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలనపై ఆదివారం ఉదయం రాజవరం గ్రామ సర్పంచ్ మంగాదేవి వీరాంజనేయులు మరియు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మరియు సచివాలయం సిబ్బంది సహకారంతో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం ప్రతి ఇంటికి వెళ్లి పరిపాలన నెరవేర్చిన హామీలు గురించి వివరించి కరపత్రాలు అందజేసి డోర్‌కి పోస్టర్ అంటించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగాదేవి వీరాంజనేయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.